ఇల వైకుంఠం.. బిలకూటక్షేత్రం

- కనులపండువగా ప్రసన్నుని కల్యాణోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన కొండబిట్రగుంట
- కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం
- రథోత్సవంలో అపశ్రుతి


కనులపండువగా జరుగుతున్న ప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


వేడుకగా సాగుతున్న రథోత్సవం

బిట్రగుంట: కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్రం మంగళవారం ప్రసన్నవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఇల వైకుంఠం వలె కనిపించింది. ప్రసన్నవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో కీలకఘట్టమైన కల్యాణోత్సవాన్ని వేద పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణ, వేదపండితుల దివ్యమంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ ప్రసన్నుని కల్యాణం కనులపండువగా జరిగింది. వేకువనే పాతబిట్రగుంట, కొండబిట్రగుంట వీధుల్లో గజవాహనంపై పెండ్లికుమారుడిగా విహరించిన స్వామివారు ఉదయం శుభముహూర్తంలో కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన పుష్పాలు, తులసిమాలలతో శోభాయమానంగా అలంకరించిన కల్యాణ వేదికపై శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు కొలువదీరారు. అదే సమయంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి – ఆదిలక్ష్మి దంపతులు, వారి కుమారుడు కోడలు సాకేత్‌రెడ్డి – మహిమారెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, కల్యాణ ద్రవ్యాలను తీసుకువచ్చారు. అలాగే కల్యాణోత్సవం ఉభయకర్తలు కూడా పట్టువస్త్రాలు, కల్యాణ ద్రవ్యాలతో వేదిక వద్దకు చేరుకున్నారు. వేదికపై స్వామివారు సర్వాలంకార భూషితులైన అనంతరం వేదపండితులు అగ్నిహోత్రం వంశీకృష్ణమాచార్యులు, ఆలయ ప్రధానార్చకులు వేదగిరి కల్యాణచక్రవర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. తొలుత విశ్వక్సేనపూజ, యజ్ఞోపవీత ధారణ, కంకణధారణ, పుణ్యాహవచనం, అనంతరం మధుపర్కం, దృశ్య, స్పర్శ, శ్రవణ వంటి షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా జరిపి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తుల గోవింద నామస్మరణలతో బిలకూటక్షేత్రం మార్మోగిపోయింది. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మాంగల్యధారణ నేత్రపర్వంగా సాగింది. భక్తులు ప్రసన్నుని కల్యాణాన్ని భక్తిపారవశ్యంతో వీక్షించి తరించారు. కల్యాణోత్సవానికి వింజం వెంకటసుబ్బమ్మ మనుమలు, మనుమరాళ్లు కొల్లపనేని వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, ఒట్టిగుంట శ్రీనివాసులు, రాములమ్మ దంపతులు ఉభయాన్ని సమర్పించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రథోత్సవంలో అపశ్రుతి

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన రథోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. రథోత్సవం పాతబిట్రగుంట నుంచి తిరిగి కొండబిట్రగుంటకు వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపుతప్పడంతో రథం నేల వాలింది. స్థానికులు, భక్తుల కథనం మేరకు పాతబిట్రగుంటలో ఊరేగింపు పూర్తయిన తర్వాత రాత్రి 9 గంటల సమయంలో తిరిగి కొండబిట్రగుంట పొలిమేరల్లోకి వచ్చేసరికి రోడ్డు మలుపులో రథం అదుపుతప్పింది. రథం కుడివైపున ఉన్న ముందు చక్రం రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దిగడంతో రథం అదుపుతప్పి నేలకు వాలింది. రథంలోని అర్చకులతోపాటు రథం చుట్టూ ఉన్న భక్తులకు కూడా అదృష్టవశాత్తు చిన్నపాటి గాయాలు కూడా కాకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు. రథాన్ని పైకి లేపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.


కొండబిట్రగుంట సమీపంలో నేల వాలిన ప్రసన్నుని రథం

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో మాతాశిశు మరణాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మాతాశిశు మరణాల నివారణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులకు సంబంధించి మెరుగైన వైద్యసేవలు అందించాలని, నిరంతరం వారి ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి సకాలంలో మందులు అందజేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించి సురక్షితమైన ప్రసవం జరిగేలా వైద్యాధికారులు దృష్టి సారించాలన్నారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సమన్వయంతో పనిచేసి మాతాశిశు మరణాలను తగ్గించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఐసీడీఎస్ పీడీ సౌజన్య, భూలోకమ్మ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీలక్ష్మికి ఘన సన్మానం



నెల్లూరు(క్రైమ్): చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎస్‌ఈబీ అధికారి శ్రీలక్ష్మి వీడ్కోలు సభను నగరంలోని మినర్వా గ్రాండ్‌లో మంగళవారం నిర్వహించారు. ఏఎస్పీ హిమవతి, ఎస్‌ఈబీ అధికారులు ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడారు. ఎస్‌ఈబీ అధికారిగా శ్రీలక్ష్మి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపారని చెప్పారు. అనంతరం శ్రీలక్ష్మి మాట్లాడారు. ఎస్పీ విజయారావు, ఏఎస్పీ హిమవతి, ఎస్‌ఈబీ అధికారుల సహకారంతో జిల్లాలో రెండేళ్ల పాటు సమర్థంగా విధులు నిర్వర్తించానని చెప్పారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకట్రామిరెడ్డి, ఎస్‌ఈబీ ఈ ఎస్ రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు చెరువులో సోమవా రం సాయంత్రం గల్లంతైన కన్నపు జగదీష్ మృతదేహాన్ని మంగళవారం ఉదయం వెలికితీశారు. స్థానిక శివాలయం వద్ద ఖర్జూరం విక్రయించేందుకు వచ్చిన జగదీష్ వల్లూరు చెరువులో దిగి గల్లంతైన విషయం తెలిసిందే. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించగా, వారు పడవ సాయంతో చెరువులో గాలించి జగదీష్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసుకువచ్చారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ చక్రధర్‌బాబు


మాట్లాడుతున్న చక్రధర్‌బాబు

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై తన క్యాంప్ కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్‌ను మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. బుధవారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు ఓటర్ స్లిప్పులను బీఎల్వోల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. ఎన్నికల డీటీలు, తహసీల్దార్లు సమీక్షించి నివేదికను అందజేయాలని పేర్కొన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఓటర్ల జాబితాలో మార్క్ చేసిన ప్రతులు, ప్రిసైడింగ్ అధికారి పుస్తకం, వివిధ రకాల కవర్లను పరిశీలించి.. లెక్క మేరకు ఉన్నాయాననే అంశాన్ని సరిచూసుకోవాలన్నారు. ఈ నెల 12న పోలింగ్ నాటికి వెబ్ క్యాస్టింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాన్నారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళలకు క్రీడా పోటీలు

నెల్లూరు(అర్బన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బుధవారం నుంచి ఈ నెల 25 వరకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళలకు క్రీడా పోటీలు, మెడికల్ క్యాంపులను నిర్వహించనున్నామని కలెక్టర్ చక్రధర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు స్టేడియం నుంచి వైఎస్సార్ విగ్రహం మీదుగా ర్యాలీని నిర్వహించి తిరిగి స్టేడియంలో హోలీ సంబరాలను జరపనున్నామని తెలిపారు. తొమ్మిదిన 100, 200, 400 మీటర్లు, షాట్‌పుట్, జావెలిన్ త్రో పోటీలు, 10న బ్యాడ్మింటన్, టెన్నిస్, బాస్కెట్‌బాల్, త్రోబాల్ పోటీలు, 11న కబడ్డీ, ఖోఖో, గ్రామీణ సంప్రదాయ క్రీడా పోటీలు, 14న యోగాసానాలు, 15న సూర్యనమస్కార పోటీలు, 17న ఆయుర్వేదం, న్యాచురోపతి, హోమియోపతిపై అవగాహన కార్యక్రమాలు, 18న మహిళలకు ఆరోగ్య, కేన్సర్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు, 19న యోగా పోటీలు, 20న స్కిప్పింగ్, తొక్కుడుబిళ్ల, లెమన్ అండ్ స్పూన్, తదితర పోటీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న బైండోవర్లు

నెల్లూరు(క్రైమ్): ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఎస్పీ విజయారావు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, ఎన్నికల కేసుల్లో ఉన్న నిందితులు, ట్రబుల్ మాంగర్ల బైండోవర్, ఆయుధాల డిపాజిట్, ఎన్బీడబ్ల్యూ వారెంట్ల ఎగ్జిక్యూషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 175 కేసులు నమోదు చేసి 760 మందిని బైండోవర్ చేశారు. 537 ఆయుధాలను డిపాజిట్ చేశారు. 209 నాన్‌బెయిలబుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేశారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై రెండు కేసులు నమోదు చేశారు. మద్యం అక్రమ తరలింపుపై 36 కేసులు నమోదు చేసి 153.43 లీటర్లను స్వాధీనం చేసుకున్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేతకు అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన ఏపీ జట్టు విజేత రాజేష్‌ను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటారెడ్డి, కామేశ్వరి సత్కరించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కోటారెడ్డి మాట్లాడారు. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు నిర్వహించిన సీనియర్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టును రాజేష్ విజేతగా నిలిపారని చెప్పారు. కోచ్ సుకృత పాల్గొన్నారు.

హత్య కేసుల్లో ఇద్దరికి జైలు

నెల్లూరు(లీగల్): రెండు హత్య కేసుల్లో నేరం రుజువు కావడంతో ఆయా కేసుల్లో హత్యకు పాల్పడిన ఇద్దరు నిందితులకు మంగళవారం కోర్టు శిక్ష, జరిమానా విధించింది.

ఏడేళ్ల జైలు, జరిమానా

ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసి హత్య చేసినట్టు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరులోని కుక్కలగుంట విఘ్నేశ్వరాపురం ప్రాంతానికి చెందిన చిదుగు దయానంద్‌కు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వాలాజీ సాయి అనే వ్యక్తి నెల్లూరు మార్కెట్‌లోని కూరగాయల దుకాణంలో పనిచేస్తుండేవాడు. కోటమిట్టలోని వీబీ ఎస్ కల్యాణ మండపం ప్రాంతంలో భార్యతో కలిసి నివాసం ఉండేవాడు. ఈ క్రమంలో 2020 అక్టోబర్ 25న ఉదయం 10 గంటల సమయంలో సాయి, అనిల్, సుబ్బారావు ముగ్గురూ కుక్కలగంట వద్ద ఉండగా, అదే ప్రాంతానికి చెందిన దయానంద్ అక్కడికి వచ్చి అనిల్‌తో గొడవపడ్డాడు. దీంతో సాయి, సుబ్బారావు సర్దిచెప్పారు. అనంతరం దయానంద్ వారిపై కోపగించుకుని గంటలో వచ్చి మీ అంతుచూస్తానంటూ బెదిరించి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్థానిక ఆటోస్టాండ్ వద్ద నిలుచుకుని ఉన్న సాయిని మద్యం మత్తులో వచ్చిన దయానంద్ కత్తితో విచక్షణారహితంగా పొడిచి గాయపరిచాడు. చుట్టుపక్కల వారు అక్కడికి రావడంతో కత్తిని పడవేసి పరారయ్యాడు. గాయపడిన సాయిని స్థానికులు నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సాయి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం దయానంద్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ విజయమ్మ కేసు వాదించారు.

మరో నిందితుడికి..


నెల్లూరు(లీగల్): లావుపాటి కర్రతో ఓ వ్యక్తి తలపై దాడి చేసి హత్యకు పాల్పడ్డాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఉత్తరప్రదేశ్ అమర్‌పూర్ జిల్లా, గ్రాహవేలి గ్రామానికి చెందిన హరిబల్వీర్‌కు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు గ్రాహవేలి గ్రామానికి చెందిన రజ్జన్, నిందితుడు హరిబల్వీర్, మరికొంత మంది బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల పంచాయతీ పరిధిలోని హైవే వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉన్నారు. బేల్దారి పనులు చేసుకుంటూ ఉండేవారు. 2018 అక్టోబర్ ఒకటో తేదీ మధ్యాహ్నం 1.30 సమయంలో హరిబల్వీర్‌తో రజ్జన్ 'మీ తండ్రి నా వద్ద నగదు తీసుకుని ఇవ్వకుండా ఎగవేశాడని.. అందుకే ఆయన క్యాన్సర్‌తో మృతిచెందాడని.. నీకు కూడా అదేగతి పడుతుందంటూ' దూషించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. దానిని మనస్సులో పెట్టుకున్న హరిబల్వీర్ అదేరోజు రాత్రి ఒంటిగంట సమయంలో నిద్రిస్తున్న రజ్జన్‌పై లావుపాటి కర్రతో దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని మిద్దెపై నుంచి కింద పడవేసి అనంతరం దగ్గరలోని బావిలో వేశాడు. ఈ ఘటనపై అద్దెకు ఉంటున్న వారిలోని ప్రసాద్ అనే యువకుడు ఫిర్యాదు చేయడంతో బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం హరిబల్వీర్‌పై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ విజయమ్మ కేసు వాదించారు.

పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారు

కందుకూరు: ఆంధ్రప్రదేశ్‌కు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలు, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల అధిపతులు స్వయంగా విశాఖపట్నంలో జరిగిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'కు వచ్చి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. రామాయపట్నం పోర్టు పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 103
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 184
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 206
లేయర్ చికెన్	: 128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.75
పండ్లు	: రూ.45



24 రోజులు.. రూ.42.45 కోట్లు

- పన్ను బకాయిల వసూళ్లలో ఇదీ లక్ష్యం
- రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులకు టార్గెట్లు మరూ
- పది వేల మంది బకాయిదారులకు రెడ్ నోటీసులు



పన్నులను వసూలు చేస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, కుళాయి పన్నులను నూరు శాతం వసూలు చేయడమే లక్ష్యంగా కమిషనర్ హరిత ప్రత్యేక దృష్టి సారించారు. వారంలో రెండు రోజులు రెవెన్యూ విభాగాధికారులతో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తూ.. వారికి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. మార్చి చివరి నాటికి వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే 10 వేల మంది పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులను జారీ చేశారు.

1,33,553 అసెస్‌మెంట్లు

నగరపాలక సంస్థ పరిధిలో 1,33,553 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇందులో రెసిడెన్షియల్ లక్ష.. కమర్షియల్ భవనాలు 25 వేలు ఉన్నాయి. 474 ప్రభుత్వ భవనాలు, 7474 డబుల్ ఎంట్రీలు, నాన్ ట్రేసింగ్ అసెస్‌మెంట్లూ ఉన్నాయి. కార్పొరేషన్లో ఏడాదిలో రూ.126.92 కోట్ల డిమాండ్ ఉంటుంది. రూ.26 కోట్ల వరకు డబుల్ ఎంట్రీలు, నాన్ ట్రేసింగ్‌లు ఉంటాయి. ఈ క్రమంలో రూ.100 కోట్లకు గానూ మంగళవారం నాటికి రూ.57.55 కోట్ల మేర వసూలు చేశారు. మరో రూ.42.45 కోట్లను వసూలు చేయాల్సి ఉంది.

వారంలో రూ.1.7 కోట్లు వసూలు

ఈ నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు రూ.1.7 కోట్ల పన్నులను రెవెన్యూ అధికారులు వసూలు చేశారు. రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు వారి పరిధిలోని అసెస్‌మెంట్ల మేరకు లక్ష్యాలను కేటాయించారు. ఆస్తి పన్ను వసూళ్లను డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు.. కుళాయి, డ్రైనేజీ పన్నుల వసూళ్లను ఇంజినీరింగ్ ఎస్‌ఈ సంపత్‌కుమార్‌కు కేటాయించారు. పన్నుల చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ప్రత్యేకంగా ఆటోలను మరో నాలుగు రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు.

పన్నుల చెల్లింపునకు 10 కేంద్రాలు

నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, కుళాయి, డ్రైనేజీ పన్ను బకాయిలను చెల్లించేందుకు పది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏసీనగర్, ఆరెస్సార్ హైస్కూల్ వద్ద గల సచివాలయం, పాత మున్సిపల్ కార్యాలయం, టీచర్స్ కాలనీలోని 26 – 1, పడారుపల్లిలోని 24 – 2, కొత్తూరులోని 30 – 1, ఆనం వెంకటరెడ్డి విగ్రహ సమీపంలోని 19 – 1 వార్డు సచివాలయాలు, కార్పొరేషన్ కార్యాలయంలో రెండు కేంద్రాలు, అల్లీపురంలోని పాత పంచాయతీ కార్యాలయంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

కళా వందనం



నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు పద్మారత్నం మర్రి ఆకుపై కార్వింగ్‌తో గర్భిణి రూపాన్ని తీర్చిదిద్దారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.

సైనిక సంక్షేమ నిధికి విరాళాలు



నెల్లూరు(అర్బన్): సైనిక సంక్షేమ నిధికి విరాళాలను పొదుపు పట్టణ సమాఖ్యల నేతలు మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కావలి పట్టణ సమాఖ్య నుంచి రూ.1.5 లక్షలు, నెల్లూరు అర్బన్ – 2, 3 పట్టణ సమాఖ్యల ఆధ్వర్యంలో రూ.45 వేలు, రూ.65 వేలను చెక్కు రూపంలో మెప్మా పీడీ రవీంద్రకు ఇచ్చారు. ఐబీ అంకయ్య, సీఎంఎం కాంతయ్య, సీఓఓ ప్రసన్న, డీఆర్పీ ప్రత్యూష, మెప్మా కార్యాలయ ఏఓ ప్రసాద్, చంద్రశేఖర్, సుధాకర్, సురేంద్ర, జరీనా, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా హోలీ



నెల్లూరు(బృందావనం): హోలీని సింహపురిలో మంగళవారం వేడుకగా జరుపుకొన్నారు. ఉత్తర భారతీయులు అధికంగా నివసించే రాయాజీవీధి, కాపువీధి, మండపాలవీధి, పెద్దబజార్, చిన్నబజార్, సంతపేట, తదితర ప్రాంతాల్లో కోలాహలం నెలకొంది. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. రాయాజీవీధిలోని రాజ్ పురోహిత్ ఖేతేశ్వర్ సమాజ్ మందిర్, తదితర ప్రాంతాల్లో పూజలు చేశారు.

ఎమ్మెల్యే అనిల్‌కు సత్కారం



నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. సుకుమార్, కిషోర్, శరత్, రవికుమార్, కృష్ణ, అనిల్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి



నెల్లూరు రూరల్: ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తూరు శ్రామికనగర్ సెంటర్‌లోని మిథిలనగర్‌లో నిర్మించిన మసీదును మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అన్నదానం చేశారు. 30వ డివిజన్ కార్పొరేటర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార పంపిణీ



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఏడీ ఎంహెచ్ఓ వెంకటప్రసాద్, క్రాంతికుమార్, శ్రావణి, విజయ్, ధర్మారావు, వేణుగోపాల్, మధు, హిమధర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ అభ్యర్థుల ఘన విజయం తథ్యం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఘన విజయం తథ్యమని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అభ్యర్థుల తరఫున ఇంటింటి ప్రచారాన్ని రూరల్ పరిధిలోని 23వ డివిజన్ పడారుపల్లిలో మంగళవారం నిర్వహించారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలోని అందరూ సమన్వయంతో వ్యవహరించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నానని చెప్పారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలు పాటుపడాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నేతలు పుల్లారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, ఎస్టీ సంఘ జిల్లా అధ్యక్షుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో హెల్త్ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా తడి, పొడి చెత్తను అధునాతన పద్ధతిలో సేంద్రియ ఎరువులుగా మార్చి తిరిగి వినియోగించేలా పర్యవేక్షించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి అన్ని దుకాణాలను తీసుకురావాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రంగయ్యస్వామి ఆరాధన

నెల్లూరు(బృందావనం): మైపాడు రోడ్డులోని రాజీవ్ గాంధీకాలనీలో రంగయ్యస్వామి పదో ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అభిషేకాలు, పూజలు, భజనలు, సాధుసంతులకు పాద పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన సాధుసంతులను సత్కరించారు. సుబ్రహ్మణ్యం, రామ్‌ప్రసాద్, వెంకటశేషయ్య, శ్రీనివాసులు, శ్రీనివాస్, మల్లికార్జున, నాగరత్నం పర్యవేక్షించారు.

రేపట్నుంచి అగ్నిగుండ మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిర ప్రాంగణంలో పాండురంగస్వామి ఆనంద అగ్నిగుండ మహోత్సవాన్ని గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 41 రోజుల మండల దీక్ష ముగింపు సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

సీఎంకు ముక్కాల దంపతుల ఆహ్వానం



నెల్లూరు(బృందావనం): నగరంలో ఈ నెల తొమ్మిది నిర్వహించనున్న తన కుమార్తె వివాహానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ఆదిలక్ష్మీకుమారి దంపతులు ఆహ్వానించారు. ఈ మేరకు తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వివాహ పత్రికను అందజేశారు.

‘నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీకి రాజీనామా’

నెల్లూరు (టౌన్): నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నానని లీలామోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ తరఫున విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేశామని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలను తెలియజేశారు.

మహిళా సంఘాల్లో నాయకత్వ మార్పిడి అవసరం



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

నెల్లూరు(అర్బన్): మహిళా సంఘాల్లో నాయకత్వ మార్పిడి ఏటా జరిగితే పారదర్శకతతో పాటు మహిళా సాధికారత సాధ్యమవుతుందని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో పొదుపు జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాలు పనిచేసే తీరు, డాక్యుమెంటేషన్, బ్యాంక్ లావాదేవీలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు నాయకత్వ మార్పిడి తప్పనిసరని చెప్పారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నూరు శాతం చెల్లించాలని, పొదుపు సంఘాలు ఏ లేదా బీ గ్రేడుల్లో మాత్రమే ఉండాలని సూచించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. డీపీఎం ఐబీ కామాక్షి, ఏపీఎం ఐబీ చిన్నయ్య, జేడీఎం హైమావతి, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉభయకర్తలుగా జనార్దన్ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

వైభవలక్ష్మికి పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో వైభవలక్ష్మి అమ్మవారికి విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. మంగళస్నానాలు, పూజలు, అర్చనలు, తదితరాలను ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, రమణమ్మ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయరాఘవేంద్ర, సుబ్బరామరాజు, ఉపాధ్యక్షుడు వేణుబాబు, కోశాధికారి శ్రీనివాసులు, రజనీకాంతమ్మ, నిర్మలమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా మహిళా దినోత్సవం



విద్యుత్ భవన్‌లో..



రావూస్ డిగ్రీ కళాశాలలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మహిళా ఉద్యోగుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

నెల్లూరు (టౌన్): వీఆర్సీ సెంటర్‌లోని రావూస్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పారిశ్రామికవేత్త జగన్నాథన్ హాజరయ్యారు. అనంతరం ప్రత్యూష, వరలక్ష్మి, సులోచన, కల్యాణి, మాధవి, భారతి, అనూరాధ, రాజ్యలక్ష్మిని సత్కరించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజకుమారి, ప్యూర్ స్మైల్స్ చారిటీస్ అధినేత పర్వీన్, మురళీమోహన్‌రాజు, శ్రీరామరాజు, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేషాభిషేకాలు



నెల్లూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను మంగళవారం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపన సీఎం జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): దేశంలోని పెద్ద పరిశ్రమల అధిపతులు, వ్యాపారవేత్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి పరిశ్రమలను స్థాపించి ఉద్యోగాలను కల్పిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజన కాలనీల్లో అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా రాష్ట్రంలో పరిశ్రమలు రాలేదని కొందరు విష ప్రచారం చేశారని ఆరోపించారు. సీఎం చేపడుతున్న చర్యలతో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణమహాలక్ష్మీదేవికి పంచామృతాభిషేకం



నెల్లూరు(బృందావనం): ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి మందిరంలో లక్ష్మీ జయంతి మహోత్సవాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. స్వర్ణమహాలక్ష్మీదేవికి పంచామృతాభిషేకం, ఉత్సవమూర్తికి నాణేలతో అభిషేకం, లక్ష కుంకుమార్చన, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమం, తదితరాలను అవధూత దత్తపీఠం నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో జరిపారు. అమ్మవారికి పల్లకిసేవను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా రాంబాబు, శ్రేయ, రాజ్యలక్ష్మి వ్యవహరించారు. గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ అజయ్‌కుమార్, ట్రస్టీలు మస్తాన్‌రెడ్డి, ప్రవీణ్‌కృష్ణ, రత్నం, సురేష్, రాజశేఖర్ పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. పరమేశ్వరినగర్‌కు చెందిన హుస్సేన్ (35), సుమయ అలియాస్ నిలోఫర్ దంపతులకు ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. సెల్‌ఫోన్ల వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న హుస్సేన్ ఆర్థికంగా నష్టపోయారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నిలోఫర్ మిద్దెపైకి వెళ్లగా, ఇంటి తలుపునకు గడియపెట్టి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని హుస్సేన్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. మిద్దెపై నుంచి కిందికి వచ్చిన భార్య తలుపులు తెరిచేందుకు విఫలయత్నం చేశారు. భర్తను పిలవగా లోపల నుంచి ఎలాంటి అలికిడి లేకపోవడంతో పెద్దగా కేకలేశారు. ఇంటి వద్దకు చేరుకున్న స్థానికులు తలుపులను పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, చీరకు వేలాడుతూ హుస్సేన్ కనిపించారు. అతడ్ని కిందికి దించి చికిత్స నిమిత్తం కిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు మృతుడి భార్య ఫిర్యాదు చేశారు. ఎస్సై హనీఫ్ ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. నిలోఫర్ ఫిర్యాదు మేరకు ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

నెల్లూరు(క్రైమ్): బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కానిస్టేబుల్ తలకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల సమాచారం మరకు.. తెలుగుంగకాలనీ సమీపంలోని పోలీస్ కాలనీకి చెందిన గిరీష్‌కుమార్ గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తన భార్యను ఆత్మకూరు బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి వదిలి ఇంటికి బయల్దేరారు. ఎంజీబీ మాల్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను అపోలో ఆస్పత్రికి తరలించారు. సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు రూరల్: నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ప్రభుత్వ గుర్తింపు కలిగిన పాఠశాలల్లో 2023 – 24 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచిత విద్య ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ తిరుపాల్ కోరారు. ఒక్కో పాఠశాలలో 100 సీట్లకు గానూ 25 సీట్లను ఉచిత విద్యకు పాఠశాల యాజమాన్యాలు కేటాయించాలనే నిబంధన ఉందని చెప్పారు. దీనికి సంబంధించి ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 14417 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మోహినీ అవతారంలో రంగనాథుడు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మోహినీ అవతారంలో స్వామివారు మంగళవారం దర్శనమిచ్చారు. పూలంగిసేవను సాయంత్రం నిర్వహించారు. బంగారు గరుడసేవను రాత్రి జరిపారు. ఉభయకర్తలుగా శివకుమార్‌రెడ్డి, సనాతన్‌రెడ్డి, ఆదికేశవరెడ్డి, నారాయణరెడ్డి వ్యవహరించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూలంగిసేవ, కల్యాణ మహోత్సవం, గజవాహనసేవను బుధవారం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి తెలిపారు.

ఐక్యతగా మాస్టర్స్ అథ్లెటిక్స్ కార్యక్రమాలు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఐక్యతగా సాగి వివిధ కార్యక్రమాలను చేపట్టనుందని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శాంతినగర్‌లోని నిర్మల సౌధలో సమావేశాన్ని అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజశిఖామణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి ఎంపికయ్యారు. కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు. కోటేశ్వరమ్మ, రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.